క్లుప్తంగా

గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల ప్రచారం నేడు

కొయ్యూరు: మండలంలోని బాలారం, ఆడాకుల, బకులూరు, కినపర్తి, పెదమాకవరం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.విశ్వేశ్వరరాజు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు బుధవారం తెలిపారు. ఆయా పంచాయతీల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గంగవరం: మండలంలోని కొమరవరం, కొత్త గంగవరం, పాత గంగవరం, రాజంపాలెం గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి గురువారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్టు పార్టీ నాయకుడు తోట రాజేశ్వరరావు చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కొద్దిసేపు వర్షం కురిసింది. పాడేరు-జి.మాడుగుల, చింతపల్లి రోడ్డు మార్గం జలమయమైంది. ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో పలు ప్రభుత్వ, ప్రయివేటు నిర్మాణ పనులకు వర్షం ఆటంకం కలిగింది. ఉరుములు, పిడుగులు వలన ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఓటుపై అవగాహన



ఓటుపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కళాజాత బృందం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నిజాయితీగా ఓటు వేద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపుడుకుందాం అంటూ కళాజాత బృందం సభ్యులు ప్రదర్శన చేశారు. కళాకారుల ఆటపాటలతో, మ్యాజిక్ రూపంలో వారపు సంతలో ప్రదర్శన అబ్బురపరిచింది. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థి మృతికి సంతాపం


కొయ్యూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి పి.శ్రీను ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సహచర విద్యార్థులు సంతాపం తెలిపారు. తక్షణమే స్పందించారు. మృతుడి కుటుంబానికి ఆయా విద్యార్థులు రూ.30వేలను అందజేసి, ఓదార్చారు. జి.రామకృష్ణ, కె.రామకృష్ణ, మల్లికార్జున్, నాగరాజు, వరహాలరాజు, రాజు, శ్యామల తదితరులున్నారు.

భానుడి భగభగలు



రాజవొమ్మంగిలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండవేడిమితో స్థానికులు ఆపసోపాలు పడ్డారు. వడగాడ్పులు, వేడిమితో పాటు ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చాలా రోజులుగా వర్షాలు కురవకపోడంతో పాటు అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎటు చూసినా ఎడారి వాతావరణం నెలకొంది. ప్రజలు ఎండలకు భయపడి ఇళ్లకే పరిమితం కావడంతో రోడ్లు నిర్మానుష్యం అయ్యాయి. పశుపక్ష్యాదులు నీటి కోసం వెంపర్లాడటం కనుపించింది. మూగజీవాలు చెట్ల నీడను సేదతీరాయి. ఎండవేడిమిని ఎక్కువగా ఉండడంతో శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు వ్యాపారం లాభసాటిగా సాగింది.



ప్రగతి పథంలో సొలభం



తాసరుబయలులో నాడు-నేడు కింద సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాల

- శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు
- దశాబ్దాల నాటి సమస్యలు పరిష్కారం
- ఆనందంలో గిరిజనం

జి.మాడుగుల: టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎంతో వెనుబడిన గిరిజన పల్లెలు నేడు జగనన్న ప్రభుత్వం పాలనలో ప్రగతి పరుగులు తీస్తున్నాయి. ప్రజావసరాలను గుర్తించి ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టింది.మండలంలో సొలభం గ్రామ సచివాలయం-1 పరిధిలోని గ్రామాల గిరిజన ప్రజలు విద్యార్థులు, వృద్ధులు.. వితంతువులు తదితర వర్గాలు ధ్రువ పత్రాలు పొందాలంటే నాడు మండల కేంద్రానికి 20 నుంచి 30 కిలోమీటర్లు పరిధిలో గల గ్రామాల గిరిజనులు వ్యయప్రయాసలకు గురై రావల్సి వచ్చేది. తాగునీటి కోసం కిలోమీటర్లు కాలినడకన వెళ్లి బురద, కలుషితమైన నీరును తెచ్చుకొని నీటి అవసరాలు తీర్చుకొనేవారు. రోగులకు వైద్యం పొందాలంటే జి.మాడుగుల, గెమ్మెలి పీహెచ్‌సీలకు అనేక బాధపడి వచ్చేవారు. వర్షాకాలంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడేవారు. గ్రామాల మధ్య రోడ్లు సౌకర్యంలో లేక అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోనకి వచ్చిన తరువాత గిరిజన కష్టాలు తీరాయి. గ్రామ సచివాలయం ఏర్పాటు చేయటంతో 35గ్రామాల ప్రజలకు సేవలు అందుబాటులోనికి వచ్చాయి. ప్రజా సమస్యలు పరిష్కరమవుతున్నాయి. గ్రామాల్లో అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. కొండకోనల్లో మారుమూల గ్రామాల్లో రోడ్లు సదుపాయం మెరుగుపడింది. ప్రజావసరాలు పరిష్కారమై గ్రామాల్లో ప్రగతి పరుగులు తీస్తుంది.సొలభం-1 గ్రామ సచివాలయం ఏర్పాటుతో 36గ్రామాలు 2100ఇల్లులు, 9వేల మంది జనాభా ఉన్నారు.

సొలభం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	జమ అయిన సొమ్ము
అమ్మఒడి	415	రూ.79,27,000
రైతు భరోసా	779	రూ.3,29,28,050
జగనన్న విద్యాదీవెన	94	రూ.16,23,597
వైఎస్సార్ ఆసరా	53	రూ.5,52,614
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	39	రూ.7,12,451
వైఎస్సార్ బీమా	13	రూ.20,30,000
వైఎస్సార్ చేయూత	138	రూ.55,87,500



ఎస్ పెదబయలు-మునకరలతోవుకు నిర్మించిన తారు రోడ్డు



సొలభం పంచాయతీలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



సొలభం గ్రామంలో కుళాయి ద్వారా మంచినీటి పడుతున్న మహిళలు

సొలభం గ్రామ సచివాలయం-1 పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు:

- ఎస్.పెదబయలు-మునకరాలతోవు గ్రామానికి రూ.2కోట్లుతో రోడ్డు నిర్మాణం
- సొలభంలో రూ.40లక్షలతో గ్రామ సచివాలయ భవనం
- ఎస్.పెదబయలు, తాసరుబయలు, జర్రాయి గ్రామాల్లోని పాఠశాలల్లో రూ.68లక్షలుతో నాడు-నేడు పనులు
- ఎస్.పెదబయలులో రూ.43లక్షలతో సీసీ రోడ్డు
- ఏనుగుగొందిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- వనభరంగిపాడులో రూ.7లక్షలతో తాగు నీటి పథకం
- పినగరువు, గొందిపాడు, గొందిగూడలలో రూ.6లక్షలతో కందకాలు పనులు
- పినగరువు గ్రామంలో రూ.5.50లక్షలతో తాగునీటి పథకం
- గ్రామ సచివాలయం నుంచి 4 కిలోమీటర్లు 15 ఆర్థిక సంఘం నిధులతో రూ.4లక్షలు మట్టిరోడ్డు పనులు
- సొలభం గ్రామంలో 2 బోర్లు నిర్మాణానికి రూ.2లక్షలు

ధ్రువ పత్రాల సమస్య తీరింది



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్టిఫికేట్లు కోసం, రోజులు, నెలలు తరబడి వేచి ఉండాల్సి వచ్చేది.మండల కేంద్రంలో గల కార్యాలయం చుట్టూ చెప్పులారిగేలా తిరిగి ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న పాలనలో గ్రామ సచివాలయం ఏర్పాటుతో ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయి. సకాలంలో ధ్రువ పత్రాలు అందుతున్నాయి. పనులు పూర్తవుతున్నాయి. ఇంటివద్దకు వచ్చి సేవలందిస్తున్నారు. జగనన్న పాలనలో ఎన్నడూ ఊహించని అభివృద్ధి, సంక్షేమ పథకాలు గిరిజనుల చెంతకు చేరాయి.

– కృష్ణమోహన్, సొలభం గ్రామం

జగనన్నకు రుణపడి ఉంటాం



గత ప్రభుత్వంలో తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడేవారం. గ్రామానికి రెండుకిలోమీటర్లు దూరంలో ఉన్న పారుగెడ్డలు, ఊటగెడ్డలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఊటగెడ్డ కలుషిత నీటి వినియోగం వల్ల తరచూ అనారోగ్య బారిన పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో గ్రామాల్లో తాగునీటి పథకాల ద్వారా వీధి కుళాయి, ఇంటింటికీ కుళాయి ద్వారా నీటి సమస్య తీరింది. ఏళ్లనాటి తాగునీటి సమస్య పరిష్కరించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఈశ్వరమ్మ, తోటలగరువు గ్రామం

శరవేగంగా అభివృద్ధి



సొలభం సచివాలయం-1పరిధిలో గిరిజన గ్రామాల్లో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ప్రజావసరాలను గుర్తించి తాగునీరు, గ్రామాల్లో సీసీరోడ్లు, తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టాం .పాఠశాలలో నాడు-నేడు కింద సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాం. గ్రామ సచివాలయం ఏర్పాటుతో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందుతున్నారు.ప్రజా సమస్యలు పరిష్కరించబడుతున్నాయి.

–ఐసరం హనుమంతరావు, సర్పంచ్ , సొలభం

ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు



అరకు ఎంపీ తనూజారాణి నామినేషన్‌కు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

హుకుంపేట: మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో బుధవారం అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనుజారాణి నామినేషన్‌కు మన్యం జిల్లాకు మండల పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతు అరకు ఎంపీ తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంలను గెలిపించేందుకు అందరం సిద్ధంగా ఉన్నామన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, జిల్లా వాణిజ్యా విభాగ అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాంగి సింహాచలం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిన్నబ్బి తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే అందరి లక్ష్యం



పెదపాడులో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నాయకులు

జి.మాడుగుల: జగనన్నను రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారంలోని తీసుకురావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేయాలని వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట కార్యదర్శి గబ్బాడి సన్యాసిదొర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు తెలిపారు. మండలంలో పాలమామిడి పంచాయతీ కొంతలం, ఏడుచావళ్లు, చీకుంబంద, లక్కుళ్లు, పెదపాడు గ్రామాల్లో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగనన్న అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి నవరత్నాల పథకాలు అమలు చేశారని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సంక్షేమ సారథికి అందరూ అండగా నిలుద్దామన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా అమ్మవొడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వాహనమిత్ర, కాపునేస్తం తదితర పథకాల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా సొమ్ము జమచేశారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలన అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి , పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, ఎంపీటీసీ కూడా చిన్నారావు, జేసీఎస్ కన్వీనర్ కళ్యాణం, పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు అంద్రయ్య, మహిళా అధ్యక్షురాలు మచ్చమ్మ, నాయకులు బ్రహ్మలింగం ,సీతారాం నాయుడు, పండన్న, గంగరాజు, వేణు, ప్రశాంత్, వెంకటరమణ, సూరిబాబు, శ్రీను, సూర్యప్రకాష్ నాయుడు, సూరిబాబు తదితరలు పాల్గొన్నారు.



భీమవరంలో గిరిజనులతో మాట్లాడుతున్న పార్టీ శ్రేణులు

హుకుంపేట: మండలంలోని భీమవరం, మెరకచింత, గన్నేరుపుట్టు పంచాయతీల్లో స్థానిక నాయకులతో కలిసి కొంతిలి సర్పంచ్ రేగం రమేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొర్ర కాసులమ్మ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. వైఎసార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంలను గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. సర్పంచ్ పాటి లక్ష్మయ్య, నాయకులు సాంభ, సదాశివరాజు, శివాజీ, దావీదు, బాలన్న, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

కె.కోటపాడు: యడ్లవానిపాలెంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ, శిఖర ప్రతిష్ఠ అనంతరం సీతారాముల దర్శనభాగ్యాన్ని భక్తులకు కల్పించారు. సీతారాములను అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమామహేశ్వరశర్మ నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన బూడిని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ముత్యాలనాయుడు(సీసీ), సత్యం, సౌజన్య, వెంకటరావు, విజయలక్ష్మి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిటీ జిల్లా ప్రతినిధుల నియామకంపై హర్షం

రాజవొమ్మంగి: వైఎస్సార్‌సీపీ విభాగాల కమిటీల ఏర్పాటు నేపథ్యంలో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఇందులో భాగంగా బీసీ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన అధికారి సత్యనారాయణ నియమితులయ్యారు. ఇదే గ్రామానికి చెందిన మంతెన ముసలయ్య ఉపాధ్యక్షులుగా, లబ్బర్తి గ్రామానికి చెందిన నీలం రామాంజనేయులు (అంజి) కార్యదర్శిగా నియమితులయ్యారు. వీరి నియామకం పట్ల స్థానిక పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ నియామకం



పాడేరు : వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పాడేరు నియోజకవర్గం చింతపల్లి మండల కేంద్రానికి చెందిన జల్లి సుధాకర్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డీనేటర్ వైవీ సుబ్బారెడ్డికి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు జల్లి సుధాకర్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు విజయానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు

- ఎన్నికల అసిస్టెంట్ అధికారి నరేంద్ర



వాహనాలను తనిఖీ చేస్తున్న తనిఖీ చేస్తున్న అధికారులు

రోలుగుంట: ఎన్నికల కోడు అమలును అనుసరిస్తూ వడ్డాది-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డులో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మండల సరిహద్దు నిండుగొండ కూడలి వద్ద ఎన్నికల సహాయాధికారి కె.నరేంద్ర తన బృందంతో బుధవారం ఈ మార్గంలో వాహనాలను ఆపి నిశితంగా శోధిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఏమైనా నగదు కాని, దుస్తులు కాని మరేవిధమైన వస్తు రూపేణా తరలించే వాటిని అరికట్టేందుకు గాను ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాల రవాణాకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సహాయాధికారి మాట్లాడుతూ రూ.50 వేలకు మించి తరలిస్తే, ఆధారాలు ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు ఉంటాయన్నారు. చోడవరం ఏఎస్సై డి.ఎస్.ఎం. కుమారి, కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఏపీవో సురేష్‌కుమార్

రాజవొమ్మంగి : మండల వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-2025)లో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది రూ.14 కోట్ల విలువైన 800 పనులు సిద్ధంగా ఉన్నాయని స్థానిక ఉపాధి హామీ పథకం ఏపీఓ సురేష్‌కుమార్ చెప్పారు. ఆయన బుధవారం మండలంలోని పలు చోట్ల జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం 4,000 మంది ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. ఈ సంఖ్య పెంచాలని ఆయా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను సూచించారు. పంట కాలువలు, చెరువుల తవ్వకాలు, చెరువుల్లో పూడికతీత, అమృత సరోవర్, ఫారం పాండ్స్, ల్యాండ్ లెవెలింగ్ పనులు, రోడ్లు, ఉద్యానవనాల పెంపకం వంటి తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మండలానికి 499 జన్‌మన్ గృహాలు మంజూరైనట్టు తెలిపారు. త్వరలో సోషల్ ఆడిట్ జరుగుతుంది కనుక రికార్డులు సక్రమంగా వుండేలా చూడాలని ఆదేశించారు. ప్రతి లబ్ధిదారునికి 90 రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి రోజువారి ఉపాధి వేతనం రూ. 272 నుంచి రూ.300లకు పెరిగిందన్నారు. ఈ అంశంపై ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పించి పనులకు వచ్చేవారి సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెరిగిన జీడిపిక్కల ధర



జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

రాజవొమ్మంగి: మండలంలో జీడిమామిడి పిక్కల ధర గణనీయంగా పెరిగింది. గత ఏడాది క్వింటా ధర రూ. 9,000 పలుకగా ఈ ఏడాది ప్రస్తుతం క్వింటాలు ధర రూ.10,500కు ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. అలాగే ధర నిలకడగా ఉండడంతో చేతికి వచ్చిన పంటను ఎప్పటికప్పుడు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కాగా ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గి రైతులు దిగాలు పడ్డారు. ధర పెరిగినా దిగుబడి లేక నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు కనీసం 5 క్వింటాళ్ల దిగుబడిని ఆశించగా ఈ ఏడాది రెండు నుంచి రెండున్నర క్వింటాళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో అరకొరగా పండిన జీడిమామిడి పంట మార్కెట్‌లో అమ్ముడవుతున్నట్టు రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీకృష్ణ

కూనవరం: ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆర్ వీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బీఎల్‌వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధులను నిబంధనల మేరకు పాటించాలని సూచించారు. సిగ్నల్స్ లేని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, రూట్ మ్యాప్‌లపై తప్పనిసరి అవగాహన కలిగి ఉండాలన్నారు. పీడీఎంఎస్ అప్లికేషన్ విధానం పై ఈసమావేశంలో నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అమ్మవారి ఆలయ ప్రారంభం రేపు

మనగపాక : తిమ్మరాజుపేటలో నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. టీటీడీ సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో నూ కాంబిక అమ్మవారి ఆల య నిర్మాణం జరిగింది. అన్ని హంగులు పూర్తి చేసుకొని శుక్రవారం ప్రారంభానికి ఆలయం ఎదురు చూస్తుంది.